

అఖిలపక్షానికి రండి!

● పునర్వ్యవస్థీకరణతో తీరని నష్టం ● పార్టీ నేతలకు సీఎం పిలుపు



లబ్ధిదారులకు సహాయాలను అందజేస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరిగితే రాష్ట్రానికి తీరని నష్టం జరుగనుందని, ఈ అంశంపై చర్చించేందుకు నిర్వహించే అఖిలపక్ష సమావేశానికి అన్ని పార్టీల నేతలు తమ భేషజాలను పక్కనబెట్టి హాజరుకావాలని ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చారు. ఒక్కరోజు పర్యటన కోసం నాగపట్టణంకు చేరుకున్న ఆయన.. సోమవారం జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా పార్టీ నేత ఇంటి శుభ కార్యంలో పాల్గొన్న సీఎం మాట్లాడుతూ.. జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ చేపట్టడం వల్ల రాష్ట్ర హక్కులను హరించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎలాంటి భేషజాలకు పోకుండా ఈ నెల 5వ తేదీ ప్రభుత్వం నిర్వహించే అఖిలపక్ష సమావేశానికి అన్ని పార్టీల నేతలు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. పునర్వ్యవస్థీకరణ పేరుతో రాష్ట్రంలోని ఎంపీ సీట్ల సంఖ్య తగ్గించడంపై కేంద్రం దృష్టిసారించిందనే విషయం ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. ఈ విషయంపై చర్చించేందుకే బుధవారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశానికి మెజార్టీ పార్టీలు హాజరవుతామని సమాచారం ఇచ్చాయని, కొన్ని పార్టీలు హాజరుకామని ప్రకటించాయని గుర్తు చేశారు. సమావేశానికి రాలేమని, రావడం వీలుపడదని చెప్పే నేతలందరూ ఈ సమావేశం ఎంత కీలకమైనదో కాస్త ఆలోచించాలన్నారు. రాష్ట్ర హక్కులకు సంబంధించిన ప్రధాన సమస్య అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. ఎంతో ముఖ్యమైన ఈ అఖిల పక్ష సమావేశానికి ప్రతి ఒక్క నేత హాజరుకావాలని సీఎం స్టాలిన్ పిలుపునిచ్చారు.

30వేల మందికి సహాయాల పంపిణీ

మరోవైపు నాగపట్టణం జిల్లా పర్యటనలో సీఎం స్టాలిన్ రోజంతా బిజీబిజీగా గడిపారు. ఉదయం నుంచి పర్యటన ముగిసేంత వరకు ఆయన ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాలు, పార్టీ నేతల సమావేశాల్లో నిమగ్నమయ్యారు. పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం.. 39 వేల మంది లబ్దిదారులకు వివిధ సంక్షేమ సహాయాలను పంపిణీ చేశారు. ఆ తర్వాత రూ.82.99 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం తమిళనాడు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కుంభకోణం డివిజన్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన 54 మహిళా బస్సు సర్వీసులు, 51 దూర ప్రాంత సర్వీసులను ప్రారంభించారు. అంతకుముందు ఆయన నాగపట్టణం ప్రభుత్వం అతిథి గృహం నుంచి కొద్దిదూరం రోడ్‌షో కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, స్థానిక డీఎంకే నేతలు పాల్గొన్నారు

రూ.65 కోట్లతో హజ్ హౌస్

స్థానిక నంగనల్లూరులో రూ.65 కోట్లతో హజ్ హౌస్‌ను నిర్మిస్తామని సీఎం స్టాలిన్ ప్రకటించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉండే ఇస్లాం ప్రజలతో పాటు దేశంలోని ఇతర మతాలకు చెందిన ప్రజలు కూడా నాగపట్టణం జిల్లాలోని నాగూర్ బాబా దర్గాకు వస్తుంటారన్నారు. ఈ జిల్లాలో ఉన్న ముస్లిం సోదరులకు ఒక శుభవార్తగా, చెన్నై ఎయిర్‌పోర్టుకు సమీపంలో నంగనల్లూరులో రూ.65 కోట్లతో హజ్ హౌస్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు.



బయట ఒకటే ఎండ.. ఎగరాలంటే రెక్కలకే ఉక్కపోత.. ఏం చేయను దేవుడా?.. నడిజామున ఎగ్మూరు మ్యూజియంలో గూడుకు చేరుకుంటున్న 'గిజిగాడు'

పెరియార్ చెప్పినట్టు అవి కట్టు కథలు కావు

● గవర్నర్ ఆర్‌ఎన్ రవి



గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

అడయార్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ నేత పెరియార్ చెప్పినట్టుగా రామాయణం, మహాభారతం కట్టుకథలు కాదని రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి పేర్కొన్నారు. స్థానిక అరుంబాక్కంలోని వైష్ణవ కాలేజీలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ... మన సంస్కృతి, సాహిత్య గ్రంథాలు ప్రపంచంలోనే పురాతనమైనవని, హిందీ సాహిత్య గ్రంథాలు మన సంస్కృతిని తెలియజేస్తున్నాయన్నారు. 1760 నుంచి మన సంస్కృతి కంటే ఉత్తర ఐరోపియా సంస్కృతి గొప్పదని బలవంతగా రుద్దే ప్రయత్నాలు జరిగాయన్నారు. తాను పెరియార్‌కు సంబంధించిన పుస్తకాలను చదువుతున్నానన్నారు. ఆయన ఆర్యులను వందేరిగల్ అని సంబోధించారన్నారు. ఆర్యుల గురించి పూర్తిగా తెలుసుకోకుండా కొందరు తమిళులు పుస్తక రచన చేస్తూ విష బీజాలు నాటుతున్నారన్నారు. మన నాగరికతను సింధు నాగరికత అని చెప్పడం కంటే సరస్వతి, సింధు నాగరికత అని చెప్పాలని కోరారు. తమిళం, సంస్కృతం ప్రపంచంలోనే పురాతన భాషలన్నారు. మన ఇతిహాసాలైన రామాయణం, మహాభారతాలను పెరియార్ కట్టుకథలుగా అభివర్ణించారన్నారు. కానీ, అవి కట్టు కథలు కావన్నారు. 3100 యేళ్ళ క్రితం జరిగినట్టుగా చరిత్ర ఆధారాలున్నాయని గవర్నర్ ఆర్‌ఎన్ రవి పేర్కొన్నారు.

ఈపీఎస్‌ను ప్రత్యర్థిగా చూడటం లేదు

● మంత్రి పీకే శేఖర్ బాబు



ఉత్తర చెన్నైలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

అడయార్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామిని తాము ప్రత్యర్థిగా చూడటం లేదని రాష్ట్ర మంత్రి పీకే శేఖర్ బాబు అన్నారు. ఉత్తర చెన్నైలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, అన్నాడీఎంకే ఇప్పటికే నశించిపోయిందన్నారు. కానీ, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారన్నారు. పైగా ఎడప్పాడిని తాము ప్రత్యర్థిగా కూడా చూడటం లేదన్నారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా ఆయన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాష్ట్ర ప్రజలు ఆయన వరుస ఓటములు ఇచ్చారని, ఇదే ఆ పార్టీ నిర్వీర్యమైపోయిందని చెప్పడానికి ప్రధాన కారణమన్నారు. వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి 200కు పైగా స్థానాలను గెలుచుకుంటుందని మంత్రి శేఖర్‌బాబు జోస్యం చెప్పారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (మంగళవారం) : 6.25
సహర్ (బుధవారం) : 4.42

ప్లస్ టూ పరీక్షలు ప్రారంభం

● తొలిరోజు ప్రశాంతం ● విద్యార్థులను పూలతో స్వాగతం పలికిన ఉపాధ్యాయులు



పరీక్షకు వెళ్లే ముందు దైవ దర్శనం చేసుకుంటున్న బాలికలు



నాగపట్టణంలోని నటరాజన్ దమయంతి మహోన్నత పాఠశాలలో ప్లస్ టూ విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలుపుతున్న పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్

చెన్నై, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 25వ తేది వరకు జరిగే పరీక్షలకు 8.21 లక్షల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రారంభమైన ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలకు రాష్ట్రంలోని 8.03 లక్షల మంది విద్యార్థినీ, విద్యార్థులు, 18,343 మంది ప్రైవేటు అభ్యర్థులు, 145 మంది ఖైదీలు హాజరవుతుండగా, 3,316 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశారు. పరీక్షా విధులకు 43,446 మంది ఉపాధ్యాయులు, 4,470 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను సిద్ధం చేశారు. సోమవారం తొలిరోజు తమిళం, ఇతర భాషా పరీక్ష జరిగింది. మంగళవారం ఆంగ్లం, 11న గణితం, కామర్స్ పరీక్షలు జరుగనున్నాయి. 18న బయాలజీ, 21న కెమిస్ట్రీ, 25న ఫిజిక్స్, ఎకనామిక్స్ సంబంధిత పాఠ్యాంశాల పరీక్ష జరుగనుంది. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు పలు నిబంధనలు విధించారు. ఆ ప్రకారం, పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించలేదు. మాస్ కాపీయింగ్ సహా పలు అవకతవకలకు పాల్పడే విద్యార్థులపై మూడేళ్ల, జీవితకాలం పరీక్షలు రాసేందుకు అనుమతించబోమని హెచ్చరించారు. కాగా, తొలిరోజైన సోమవారం జరిగిన పరీక్షకు 8,02,567 మంది హాజరు కాగా, 11,430 మంది అబ్సెంట్ అయ్యారని అధికారులు తెలిపారు.



ఎగ్మూర్ ప్రెసిడెన్సీ బాలికల పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

నేటినుంచి ప్లస్ వన్ పరీక్షలు...

రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ప్లస్ వన్ పబ్లిక్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు 8.23 లక్షల మంది విద్యార్థులు హారుకానున్నారు. అలాగే, ఈ నెల 28వ తేది నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు 9.13 లక్షల మంది విద్యార్థులు హాజరుకానుండగా, 4,113 పరీక్షా కేంద్రాలు ఏర్పాటయ్యాయి.

కుంభకోణం కాశీ విశ్వనాథుడి ఆలయంలో మాసిమఖం ఉత్సవాలు ప్రారంభం

12న తీర్థవారీ





కాశీ విశ్వనాథుడి ఆలయంలో ధ్వజారోహణం చేస్తున్న ప్రధానార్చకులు, శైవపండితులు - తిరుచెందూరు ఆలయ ధ్వజస్తంభానికి మహాదీపారాధన చేస్తున్న ప్రధానార్చకులు

టి.నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా కుంభకోణం మహామఖం కొలనుకు ఉత్తర దిశలో ఉన్న సుప్రసిద్ధ కాశీ విశాలాక్షి సమేత కాశీ విశ్వనాథుడి ఆలయంలో మాసిమఖ ఉత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 11న రథోత్సవం, 12న తీర్థవారీ జరుగనున్నాయి. నవకన్యల క్షేత్రంగా భాసిల్లుతున్న ఈ ఆలయంలో ప్రతియేటా మాసిమఖ ఉత్సవాలు పదిరోజులపాటు నిర్వహిస్తారు.. ఆ మేరకు ఈ యేడాది ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలుత పంచమూర్తులను ధ్వజస్తంభం ఎదుట కొలువుదీర్చారు. ఆ తర్వాత శివాచార్యులు, వేదమంత్రాలు పఠిస్తుండగా పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో ధ్వజస్తంభానికి అభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత నందీశ్వరుడి చిత్రంతో ఉన్న ధ్వజ పటాన్ని ధ్వజస్తంభంపై ఎగురవేశారు. ఈ ఉత్సవాల్లో రోజూ ఉదయం, సాయంత్రం స్వామి, అమ్మవార్లను వివిధ రకాల వాహనాలలో ఊరేగించనున్నారు. ఈ ఉత్సవాల్లో అత్యంత కీలకఘట్టాలైన వెన్నయ్‌తాళి పల్లకీలో స్వామివారి ఊరేగింపు ఈ నెల 10న, 11న రథోత్సవం, 12న తీర్థవారి వేడుకలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి.

తిరుచెందూరు ఆలయంలో...: తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయంలో మాసిమఖం ఉత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఒంటి గంటకు ఆలయాన్ని తెరచి 1.30 గంటలకు విశ్వరూప దీపారాధన, రెండు గంటలకు ఉదయ మార్తాండాభిషేకం, మూడు గంటలకు ఉదయమార్తాండ దీపారాధన నిర్వహించారు. వేకువజాము నాలుగు గంటలకు వెండి పల్లకిలో ధ్వజ పటాన్ని నవ సన్నిధుల మీదుగా ఊరేగింపు తీసుకొచ్చి ధ్వజస్తంభం వద్ద ఉంచారు. వేకువజాము 5.20 గంటలకు ఆ తర్వాత ఆలయ ప్రాకారంలోని ధ్వజస్తంభం చుట్టూ కంకణ ధారణ చేసిన ముత్తుకుమారసామి భట్టర్ మాసి ఉత్సవాల ధ్వజారోహణం చేశారు. అనంతరం 16 రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. 6.40 గంటలకు మహాదీపారాధన చేశారు. ఈ వేడుకల్లో తిరువాడుదురై ఆధీనం శ్రీమద్ శంకరలింగ తంబిరాన్‌స్వామి, తిరుచెందూరు జడ్జి సెల్వ పాండ్యన్, ఆలయ తక్కార్ (టస్టీ) అరుళ్‌మురుగన్, ఆలయ డిప్యూటీ కమిషనర్ జ్ఞానశేఖరన్, అసిస్టెంట్ కమిషనర్ నాగవేల్, తిరుచెందూరు పురపాలక సంఘం ఉపాధ్యక్షుడు సెంగుళి రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఈ నెల 12న జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

కోవైలో దారుణం

భార్యను తుపాకితో కాల్చి, ఆత్మహత్య



కృష్ణకుమార్-సంగీత (ఫైల్‌ఫొటో)

అడయార్, మార్చి 3 (ఆంధ్రజోతి): కోయంబత్తూర్‌లో టీచర్‌ను తుపాకితో కాల్చిన భర్త తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కోయంబత్తూర్ జిల్లా సూలూరు సమీపం పట్టణంపుదూర్ లక్ష్మీ నగర్‌కు చెందిన కృష్ణకుమార్ (50) భార్య సంగీత (45) ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. ఈ దంపతులకు 9, 11 తరగతులు చదువుతున్న ఇద్దరు కుమార్తెలున్నారు. కృష్ణకుమార్ దుబాయ్‌లో ఉద్యోగం చేస్తూ కొన్ని సంవత్సరాల క్రితం స్వగ్రామానికి తిరిగొచ్చి, కేరళ రాష్ట్రం పాలక్కాడు జిల్లా మంగళం గ్రామంలోని తోటను పర్యవేక్షిస్తున్నాడు. ఈ నేపథ్యంలో, సోమవారం ఉదయం కృష్ణకుమార్ గాయాలతో మృతిచెంది పడి ఉండడాన్ని గమనించిన కొందరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని విచారించగా కృష్ణకుమార్ తుపాకితో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన కేరళ పోలీసులు, కృష్ణకుమార్ బంధువులతో కోవై వచ్చి సంగీత ఇంటికెళ్లారు. తలుపు తట్టినా ఎలాంటి స్పందన లేకపోవడంతో తలుపులు తెరచి లోనికి వెళ్లగా సంగీత మృతిచెంది ఉండడం గమనించారు. ఈ వ్యవహారంపై కేరళ పోలీసులతో పాటు సూలూరు పోలీసులు కూడా విచారణ చేపట్టారు. ప్రాథమిక విచారణలో, కృష్ణకుమార్ ముందుగా సంగీతను తుపాకితో కాల్చిన అనంతరం తన తోటలోకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిసింది. అలాగే, కొద్దికాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవని, భార్య వ్యవహార శైలిపై కృష్ణకుమార్‌కు అనుమానం వచ్చిందని, ఈ కారణంగా ఆమెపై కృష్ణకుమార్ ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిసింది. ఈ ఘటనపై ఇరు రాష్ట్రాల పోలీసులు కేసులు నమోదుచేసి విచారిస్తున్నారు.

సమాచార దృష్టి

రూ.305 కోట్లతో సెమీ కండక్టర్ ప్లాంట్

పెరంబూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మలేసియాకు చెందిన వీసీఐ గ్లోబల్ సంస్థ దేశంలో మొదటి సెమీ కండక్టర్ ప్లాంట్‌ను చెన్నై సమీపంలో ఏర్పాటుచేయనుంది. రూ.305 కోట్లతో సెమికండక్టర్ ఫ్యాక్టరీ ప్రారంభించనున్నారు. వీసీఐ గ్లోబల్, కినెసిస్ మాన్యుఫాక్చరింగ్ సొల్యూషన్స్ భాగసామ్యంతో ఈ ఫ్యాక్టరీ ఏర్పాటుకానుందని అధికారులు తెలిపారు.

31 వరకు ఉచిత చీర, ధోవతుల పంపిణీ

పెరంబూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రేషన్ దుకాణాల్లో ఈ నెల 31వ తేది వరకు ఉచిత చీర, ధోవతులు పొందవచ్చని ఆహార శాఖ అధికారులు తెలిపారు. పొంగల్ పండుగ సందర్భంగా రేషన్‌కార్డుదారులకు కిలో పచ్చి బియ్యం, కిలో చక్కెర, ఒక చెరకు గడ, చీర, ధోవతి తదితరాలను ఉచితంగా అందించారు. ఈ ఏడాది పొంగల్ ఉచితాల్లో నగదు లేకపోవడంతో, ఉచితాలు తీసుకొనేందుకు ప్రజలు ఆసక్తి చూపలేదు. ఈ నేపథ్యంలో, రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్న పొంగల్ చీర, ధోవతి తదితరాలు ఇప్పటికీ తీసుకోని రేషన్ కార్డుదారులు, ఈ నెల 31వ తేది వరకు పొందవచ్చని అధికారులు తెలిపారు.

ఐసీయూ, ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.122 కోట్లు

పెరంబూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 8 ప్రభుత్వాస్పత్రుల్లో అత్యవసర చికిత్సా విభాగం (ఐసీయూ), అత్యాధునిక ల్యాబొరేటరీ ఏర్పాటుకు రూ.122 కోట్లు కేటాయించారు. ఆ ప్రకారం, కరూర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రి, మనప్పారై, కోవిల్‌పట్టి, మేట్టుపాళయం, సెంగోట్టై తదితర ఐదు ప్రభుత్వాసుపత్రుల్లో తలా 50 పడకలతో కూడిన ఐసీయూ విభాగాలు ఏర్పాటుకానున్నాయి. అలాగే, కుంభకోణం, తెన్‌కాశి, కాంగేయం తదితర మూడు ప్రభుత్వాసుపత్రుల్లో ఆధునాతన ల్యాబొరేటరీలు ఏర్పాటుచేయనున్నట్లు ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

తాగునీటి సరఫరా పర్యవేక్షణకు మీటర్లు

పెరంబూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పర్యవేక్షణకు తొలివిడతగా 8వేల మీటర్లు, కంట్రోల్ సెంటర్ ఏర్పాటుచేయాలని మున్సిపల్ పరిపాలన, నీటి సరఫరా విభాగం నిర్ణయించింది. స్థానిక సంస్థల ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా చేస్తున్నారు. వీటిలో ఉమ్మడి నీటి సరఫరా, పెద్ద ప్రాజెక్ట్‌ల్లో ఎంత నీరు సరఫరా చేస్తున్నారనే సమాచారం అందుబాటులో ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఈ సౌకర్యం లేదు. దీంతో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాగునీటి విడుదలపై విధించిన నిబంధనల మేరకు గ్రామాల్లో తాగునీరు సరఫరా చేస్తున్నారా? అనే దానిని పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నుంచి ప్రతిరోజు ఎంత నీరు సరఫరా చేస్తున్నారు అనే విషయం పరిశీలనకు తొలివిడతగా 8,000 మీటర్లు అమర్చనున్నారు. అలాగే, తాగునీటి సరఫరాపై ప్రజలు ఫిర్యాదు చేసేలా కంట్రోల్ సెంటర్ కూడా ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు దరఖాస్తు గడువు పెంపు

పెరంబూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో చేరేందుకు నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఎన్‌సీహెచ్‌ఎం) జేఈఈ పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. జాతీయ పరీక్ష ఏజెన్సీ (ఎన్టీఏ) ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించనుంది. ఎన్‌సీహెచ్‌ఎం ఆధ్వర్యంలోని 78 విద్యా సంస్థల్లో 2025-25 విద్యా సంవత్సరానికి బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సుల్లో చేరేందుకు ఏప్రిల్ 27వ తేది ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు దరఖాస్తు స్వీకరణ డిసెంబరు 16న ప్రారంభమై ఫిబ్రవరి 28వ తేదీతో ముగిసింది. ఈ నేపథ్యంలో, విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు గడువు ఈ నెల 15వ తేది వరకు పొడిగించారు. విద్యార్థులు www.nta.ac.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చు. మరిన్ని వివరాలకు 011-40759000, 69227700 అనే నెంబర్లు సంప్రదించవచ్చని ఎన్టీఏ ప్రకటన విడుదల చేసింది.

8న అన్నాడీఎంకే ధర్నా

పెరంబూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లైంగిక వేధింపులను అరికట్టడంలో విఫలమైన డీఎంకే ప్రభుత్వాన్ని ఖండిస్తూ ఈ నెల 8న అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విడుదల చేసిన ప్రకటనలో. లైంగిక వేధింపులు, అత్యాచారాలు జరగడం దిగ్ర్భాంతి కలిగిస్తుందన్నారు. వాటిని అడ్డుకోవాల్సిన డీఎంకే ప్రభుత్వం, తమ ప్రభుత్వ హయాంలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని పేర్కొనడం ఆశ్చర్యం కలిస్తుందన్నారు. డీఎంకే ప్రభుత్వ తీరును ఖండిస్తూ మహిళా దినోత్సవం రోజైన ఈ నెల 8వ తేది ఉదయం 9 గంటలకు తిరునల్వేలి రైల్వే జంక్షన్ సమీపంలో ధర్నా నిర్వహించనున్నట్లు పళనిస్వామి తెలిపారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ బోగీలు

పెరంబూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నీలగిరి ఎక్స్‌ప్రెస్ ఎల్‌హెచ్‌బీ బోగీలు ఏర్పాటు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. చెన్నై సెంట్రల్-మేట్టుపాళయం మధ్య ప్రతిరోజూ నడుపుతున్న నీలగిరి ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం అందించేలా ఎల్‌హెచ్‌బీ బోగీలు అనుసంధానం చేయనున్నారు. ఎరుపు రంగుతో కూడిన ఈ బోగీల బరువు తక్కువగా ఉంటాయి. ఫలితంగా మరింత అదనపు వేగంతో రైలు నడుపవచ్చు. చెన్నై సెంట్రల్-మేట్టుపాళయం మధ్య సోమవారం నుంచి, మేట్టుపాళయం-చెన్నై సెంట్రల్ మధ్య మంగళవారం నుంచి నీలగిరి ఎక్స్‌ప్రెస్ రైళ్లు పూర్తిగా ఎల్‌హెచ్‌బీ బోగీలతో నడుస్తాయని దక్షిణ రైల్వే తెలిపింది. ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యమని వివరించింది.

భిక్ష పాత్రలతో జాలర్ల ఆందోళన

● ఆత్మహత్యలు చేసుకుంటామంటూ హెచ్చరిక

టి.నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తమిళ జాలర్లపై శ్రీలంక నావికాదళం జరుపుతున్న దాడులను నిరోధించటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, శ్రీలంక జైళ్లలో ఉన్న జాలర్లందరినీ వెంటనే విడుదల చేయించాలని కోరుతూ ఫిబ్రవరి 24 నుంచి రామేశ్వరం జాలర్లు చేస్తున్న ఆందోళనలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. సోమవారం ఉదయం తంగచ్చిమఠం వద్ద జాలర్లు భిక్షాపాత్రలతో నిరాహార దీక్షను కొనసాగించారు. ఈ సందర్భంగా జాలర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా తమ ఆందోళనకు ఈసారి పలు వర్గాల నుండి స్పందన అధకంగా లభిస్తోందని, గవర్నర్ నిరాహార దీక్షా శిబిరం వద్దకే వచ్చి పరామర్శించడం గమనార్హన్నారు. మంగళవారం ఉదయం లోగా తమ డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోతే నిరాహార దీక్ష చేస్తున్న తామంతా ఆత్మాహుతి చేసుకుంటామని హెచ్చరించారు.


భిక్షాపాత్రలతో నిరాహార దీక్ష కొనసాగిస్తున్న జాలర్లు

ఉద్యోగిని బెదిరించి రూ.2.30 లక్షలు స్వాహా

● మహిళ సహా ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఓ ఉద్యోగిని అర్ధనగ్నంగా చిత్రీకరించి, ఆ వీడియోలతో బెదిరించి రూ.2.30 లక్షలు స్వాహా చేసిన వ్యవహారంలో మహిళ సహా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుపత్తూర్ జిల్లా పుదుపేట రోడ్డు ప్రాంతానికి చెందిన ఓ ప్రభుత్వోద్యోగి తల్లికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఆమె సంరక్షణ కోసం ధర్మపురి జిల్లా పాలక్కాడు ప్రాంతానికి చెందిన సెల్వి (35) నడుపుతున్న హోమ్ కేర్ సంస్థను సంప్రదించాడు. ఈ సంస్థ నళిని అనే మహిళను ఆ ఉద్యోగి తల్లి సంరక్షణ కోసం పంపించింది. ఈ క్రమంలో, నళినికి, ఆ ఉద్యోగికి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడినట్లు తెలిసింది. ఇదే అదనుగా తీసుకున్న నళిని అతడు నగ్నంగా ఉన్న సమయంలో సెల్‌ఫోన్‌లో చిత్రీకరించింది. ఈ వీడియోను సంస్థ యజమానికి పంపింది. ఆమె ఆ చిత్రాలను ఆ ఉద్యోగికి పంపి, రూ.5 లక్షలు ఇస్తే వాటిని ఇస్తామని బెదిరించింది. దీంతో ఆ వ్యక్తి తొలివిడతగా రూ.2.30 లక్షలు చెల్లించి, మిగిలిన నగదు తర్వాత ఇస్తానని తెలిపాడు. అతను తర్వాత నగదు పంపకపోవడంతో సెల్వి, తన సంస్థలో పని చేస్తున్న విమల్‌రాజ్ అనే వ్యక్తిని ఆ ప్రభుత్వోద్యోగి ఇంటికి పంపింది. విమల్‌రాజ్ అతడి అసభ్య చిత్రాలు చూపి నగదు ఇవ్వాలని బెదిరించసాగాడు. వారి వేధింపులు తట్టుకోలేని ప్రభుత్వోద్యోగి తిరుపత్తూర్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు, సోమవారం సెల్వి, నళిని, విమల్‌రాజ్‌లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి, వేలూరు జైలుకు తరలించారు.

జాలర్ల విషయంలో మోదీ ద్వంద్వ వైఖరి

● సెల్వపెరుందగై

అడయార్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన జాలర్ల విషయంలో ప్రధాని మోదీ ద్వంద్వ వైఖరిని అవలంభిస్తున్నారని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై ఆరోపించారు. ఈ విషయంపై ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే జాలర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొంటామని 2014 ఎన్నిలకు ముందు నాటి మహిళా నేత దివంగత సుష్మా స్వరాజ్ హామీ ఇచ్చారన్నారు. ఆ యేడాది జరిగిన ఎన్నికల్లో కేంద్రంలో మోదీ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటై 11 యేళ్ళు గడిచిపోయిందన్నారు. కానీ జాలర్ల సమస్య ఇప్పటికీ అలానే ఉండటమే కాకుండా, మరింత పెరిగిందన్నారు. శ్రీలంకు భారీగా ఆర్థిక సాయం చేస్తున్న ప్రధాని మోదీ.. కచ్చాదీవితో పాటు జాలర్ల సమస్యను పరిష్కరించేందుకు ఎందుకు చర్యలు చేపట్టలేదని ఆయన ప్రశ్నించారు.

కృష్ణా జలాల కోసం ఆంధ్రా వెళ్తున్న అధికారులు

పెరంబూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేలా కృష్ణ జలాల నిర్వహణ రుసుము చెల్లించేందుకు రాష్ట్ర అధికారులు త్వరలో ఆంధ్ర రాష్ట్రం వెళ్లనున్నారు. రాజధాని నగరం చెన్నై ప్రజల దాహార్తి తీర్చేలా నదీజలాల ఒప్పందంలో భాగంగా ఆంధ్ర రాష్ట్రం కండలేరు డ్యాం నుంచి ప్రతి ఏడాది 12 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి ఉంది. కానీ, ఇప్పటివరకు ఒప్పందం మేరకు నీటిని విడుదల చేసిన దాఖలాలు లేవు. 2023-24వ సంవత్సరంలో 2.41 టీఎంసీలు, 2024-25వ సంవత్సరంలో 2 టీఎంసీల నీరు మాత్రమే విడుదల చేశారు. ఈ నీటిని పొందేందుకు, ప్రతి ఏడాది నిర్వహణ రుసుముగా రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు చెల్లిస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు 4 టీఎంసీల నీరు వదలాల్సి ఉండగా, ఇప్పటివరకు 2 టీఎంసీలు మాత్రమే అందింది. మిగిలిన 2 టీఎంసీల నీరు పొందితే, నగర ప్రజలకు వేసవిలో అంతరాయం లేకుండా తాగునీరు సరఫరా చేసే అవకాశముంది. అందువల్ల, ఆ నీటిని పొందేందుకు జలవనరుల శాఖ చర్యలు చేపట్టింది. ఆ శాఖ అధికారుల బృందం త్వరలో ఆంధ్ర రాష్ట్రానికి వెళ్లనుంది. ఆ సమయంలో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నిర్వహణ రుసుము చెల్లించనున్నట్లు చెన్నై మండల జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

సెల్‌ఫోన్‌కు బదులు సబ్బు !

ప్యారీస్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో సెల్‌ఫోన్ ఆర్డరు చేయగా, డవ్ సోపు రావడంతో వినియోగదారుడు దిగ్ర్భాంతి చెందాడు. ప్రస్తుతం అధిక శాతం మంది ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, రాణిపేట జిల్లా భానావరంకు చెందిన యోగేష్, ఆన్‌లైన్‌లో రూ.25 వేల విలువైన మొటోరోలా సెల్‌ఫోన్ ఆర్డరు చేశాడు. ఆదివారం అందుకున్న పార్శిల్‌లో సెల్‌ఫోన్‌కు బదులు రూ.120 విలువైన డవ్ సోపు ఉండడం చూసి దిగ్ర్భాంతి చెందాడు. గతంలో ఇలాంటి వ్యవహారం గురించిన విన్న యోగేష్, పార్శిల్ తెరుస్తూ వీడియో తీసారు. ప్రస్తుతం ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కాగా, ఈ విషయమై ఆన్‌లైన్ సంస్థకు ఫిర్యాదు చేసినట్లు యోగేష్ తెలిపాడు.


ఆన్‌లైన్‌లో వచ్చిన పార్శిల్‌లో ఉన్న డవ్ సోపు

సీమాన్‌కు ఊరట కేసు విచారణపై తాత్కాలిక స్టే విధించిన సుప్రీంకోర్టు

పెరంబూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నామ్ తమిళర్ పార్టీ ఆర్గనైజర్ సీమాన్‌పై లైంగిక వేధింపుల కేసు విచారణకు సుప్రీంకోర్టు తాత్కాలిక స్టే విధించింది. నామ్ తమిళర్ పార్టీ ఆర్గనైజర్ సీమాన్, తనను వివాహం చేసుకుంటానని నమ్మించి, లైంగిక వేధింపులకు పాల్పడినట్లు, అనంతరం తనను మోసం చేశారని నటి విజయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాని ఆధారంగా సీమాన్‌పై కేసు నమోదైంది. ఈ కేసు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. ఈ కేసు రద్దు చేయాలని మద్రాసు హైకోర్టులో సీమాన్ పిటిషన్ వేశారు. దీనిని విచారించిన హైకోర్టు, సీమాన్‌పై నమోదైన కేసు రద్దుకు నిరాకరించడంతో పాటు, సీమాన్ కేసు తీవ్రమైనదిగా అభిప్రాయం వ్యక్తం చేస్తూ, కేసు 12 వారాల్లో ముగించాలని పోలీసు శాఖకు ఆదేశించింది. హైకోర్టు ఉత్తర్వులో కేసు విచారణ వేగవంతమైంది. సీమాన్‌కు సమన్లు పంపిన పోలీసులు, పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారించారు. అలాగే, విజయలక్ష్మి వాంగ్మూలం కూడా తీసుకున్నారు. ఈ నేపథ్యంలో, తనపై కేసు విచారణకు స్టే విధించాలని కోరుతూ సీమాన్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ సోమవారం విచారణకు వచ్చింది. ఆ సమయంలో... ఫిర్యాదు చేసిన నటి ఇంతకుముందు మూడు సార్లు కేసు వాపసు తీసుకుందని, అధికారంలో ఉన్న కొత్త ప్రభుత్వం, రాజకీయ కక్షల కారణంగా ఈ కేసు మళ్లీ విచారణ ప్రారంభించిందని, ఈ కేసు విచారణకు స్టే విధించాలని సీమాన్ తరఫున తెలియజేశారు. ఈ వాదన పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తులు... సీమాన్ లైంగిక వేధింపు కేసు విచారణకు తాత్కాలిక స్టే విధించింది. అలాగే, ఈ కేసులో ప్రతివాదులు సమాధానం చెప్పాలని న్యాయమూర్తులు ఉత్తర్వులు జారీచేశారు.

తీర్పును ఆహ్వానిస్తున్నా... సీమాన్

సుప్రీంకోర్టు తీర్పుపై సీమాన్ స్పందిస్తూ... నటితో చర్చలకు అవకాశం లేదని, అవసరం కూడా లేదన్నారు. ఈ కేసు ఎలా చూసినా అవవాదు, అబద్ధం అని తెలుస్తుందన్నారు. కోర్టు మధ్యంతర ఉత్తర్వులు స్వాగితిస్తున్నామని, చట్ట ప్రకారం నడుచుకుంటామని సీమాన్ తెలిపారు.

హిజ్రా వద్ద ఐఫోన్ చోరీ యువకుడి అరెస్ట్

పెరంబూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక చూలైమేడులో హిజ్రా వద్ద ఐఫోన్ చోరీచేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. చూలైమేడు ఆండవర్ వీధికి చెందిన హిజ్రా ఝాన్సీ ఓ ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తోంది. ఝాన్సీ ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంలో కూవం నది వంతెన మీదుగా వెళ్తున్న సమయంలో, ఆ ప్రాంతంలో నిల్చున్న యువకుడు ఝాన్సీ వాహనాన్ని ఆపి, తన సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ అయిందని, ఇంటికి ఫోన్ చేసుకోవాలని కోరాడు. దీంతో, ఝాన్సీ తన వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లలో ఐఫోన్ ద్విచక్రవాహనంపై ఉంచి మరో సెల్‌ఫోన్‌లో ఆ యువకుడు చెప్పిన నెంబరుకు కాల్ చేస్తోంది. ఆ సమయంలో వాహనంపై ఉంచిన ఐఫోన్‌ను తీసుకొని యువకుడు పరారయ్యాడు. దీనిపై ఝాన్సీ ఫిర్యాదుతో కేసు నమోదుచేసి విచారణ చేపట్టిన చూలైమేడు పోలీసులు, తండయార్‌పేట వినోభా నగర్‌కు చెందిన చంద్రును అరెస్ట్ చేసి, అతని నుంచి ఐఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే చంద్రుపై ఓ చోరీ కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు బీజేపీ కేంద్ర కమిటీ సమావేశం

పెరంబూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీ కేంద్ర కమిటీ సమావేశం మంగళవారం జరుగనుంది. 2026 జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన జరిగితే రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 39 నియోజకవర్గాలు తగ్గే అవకాశముందని తెలుస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఈ నెల 5వ తేది అఖిలపక్ష పార్టీల సమావేశానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాల్గొనాలని 45 పార్టీలకు ఆహ్వానం పంపిన నేపథ్యంలో, బీజేపీ, టీఎంసీ తదితర పార్టీలు సమావేశంలో పాల్గొనమని ప్రకటించిన నేపథ్యంలో, ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే, డీఎండీకే సహా పలు పార్టీలు హాజరవుతున్నట్టు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో, రాష్ట్ర బీజేపీ కేంద్ర కమిటీ సమావేశం టి.నగర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సాయంత్రం 5 గంటలకు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై నేతృత్వంలో జరుగనుంది. నియోజకవర్గాల పునర్విభజన, త్రిభాషా విధానానికి అనుకూలంగా సంతకాల సేకరణ సహా పలు అంశాలపై సమావేశంలో చర్చించనున్నారని, పార్టీ సీనియర్ నేతలు తమిళిసై సౌందర్‌రాజన్, వానతి శ్రీనివాసన్ సహా పలువురు పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

ప్లస్‌టూ పరీక్షా కేంద్రాల్లో ప్రైవేటు కళాశాలల సిబ్బంది

● పరీక్షకు వచ్చిన విద్యార్థులతో ప్రచారం

తిరుత్తణి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు కళాశాలలో ప్లస్‌టూ పరీక్షలకు హాజరైన విద్యార్థులతో తమ కళాశాల కరపత్రాలిచ్చి ప్రచారం చేయించిన ఘటన తిరుత్తణిలో చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో పరీక్ష పూర్తయ్యాక, ఇంటికి వెళ్ళే క్రమంలో విద్యార్థులతో తమ కళాశాలకు సంబంధించిన కరపత్రాలు ఇచ్చి వీదుల్లో ప్రచారం చేయించారు. ఈ ప్రచారంలో ఆ కళాశాల ఉపాధ్యాయులు కూడా పాల్గొనడం గమనార్హం. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత కళాశాలపై విద్యాశాఖకు ఫిర్యాదు చేశారు. పరీక్షకు వచ్చిన తమ పిల్లలను ఈ విధంగా వీధుల్లో వారి కళాశాల ప్రచారాలకు వాడుకోవడమేమిటని అధికారులతో విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. ఇలాంటి పనులు చేయించే వారిపై తగు చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని కోరారు.


విద్యార్థులతో కళాశాల కరపత్రాలు పంపిణీ చేయిస్తున్న దృశ్యం

7న టీవీకే ఆధ్వర్యంలో ఇఫ్తార్

● హాజరుకానున్న విజయ్

పెరంబూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఆధ్వర్యంలో ఈ నెల 7న ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ విడుదల చేసిన ప్రకటనలో... రాయపేట వైఎంసీఏ మైదానంలో ఇఫ్తార్ విందు ఇవ్వనున్నామన్నారు. పార్టీ అధ్యక్షులు విజయ్ పాల్గొంటారని ప్రకటనలో తెలిపారు.

అండమాన్ నుంచి చెన్నై తిరిగొచ్చిన విమానం

పెరంబూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మీనంబాక్కం విమాశ్రయం నుంచి అండమాన్ వెళ్లిన విమానం, అక్కడ వాతావరణం అనుకూలించకపోవడంతో మళ్లీ మీనంబాక్కంలో ల్యాండింగ్ అయింది. సోమవారం తెల్లవారుజామున 4.40 గంటలకు 162 మంది ప్రయాణికులతో ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం అండమాన్ వెళ్లింది. అండమాన్ విమానాశ్రయంలో బలమైన గాలులు వీస్తుండడంతో విమానం ల్యాండింగ్‌కు అనుకూల పరిస్థితులు లేవు. అధికారుల అనుమతితో ఆ విమానం ఉదయం 8 గంటలకు మళ్లీ మీనంబాక్కం చేరుకుంది. అండమాన్‌లో వాతావరణం అనుకూలించడంతో కొద్ది గంటల అనంతరం మళ్లీ బయల్దేరి వెళ్లింది.

పెరియార్ వర్సిటీ రిజిస్ట్రార్‌కు హైకోర్టు సమన్లు

ప్యారీస్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కేసులో పెరియార్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ నేరుగా హాజరుకావాలని మద్రాసు హైకోర్టు సోమవారం సమన్లు జారీచేసింది. పెరియార్ వర్సిటీలో అసిస్టెంట్లుగా పనిచేస్తున్న కుళందైవేల్ సహా పలువురు 2013లో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారించిన మద్రాసు హైకోర్టు, సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు కల్పించాలని 2017లో ఆదేశించింది. హైకోర్టు ఆదేశించినా పదోన్నతి కల్పించకపోవడంతో కోర్టు ధిక్కార కేసు నమోదైంది.

టాస్మాక్ బార్లలో తనిఖీలు

ప్యారీస్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మధ్య చెన్నై పరిధిలోని 50 టాస్మాక్ బార్లలో టాస్మాక్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. టాస్మాక్ బార్లలో అనుమతి లేకుండా వంట గది ఏర్పాటుచేసి మాంసాహార పదార్థాలు విక్రయిస్తున్నారనే ఫిర్యాదుపై అధికారులు తనిఖీలు చేపట్టారు. వంట గదుల్లో పనిచేస్తున్న వారిని అరెస్ట్ చేశారు. వంటసామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

రామజయం హత్యకేసు దర్యాప్తు అధికారుల బదిలీ

ప్యారీస్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రామజయం హత్య కేసులో దర్యాప్తు అధికారులను మార్చాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. మంత్రి కేఎన్ నెహ్రూ సోదరుడు రామజయం హత్య కేసు విచారణ రాష్ట్ర పోలీసులకు బదిలీ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ మంగళవారం విచారించిన న్యాయస్థానం, విచారణ అధికారులుగా తిరుచ్చి డీఐజీ, తంజావూరు ఎస్పీలను నియమించాలని ఉత్తర్వులు జారీచేసింది.

ఎస్ఐ వాకీటాకీ చోరీ

ప్యారీస్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో వాహన తనిఖీలు చేస్తున్న స్ వాకీటాకీని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. అన్నానగర్ వెస్ట్ డిపో సమీపంలో సోమవారం ఎస్ఐ ద్విచక్రవాహనంలో వెనుకగా కూర్చొని ప్రయాణిస్తున్నాడు. ఆ సమయంలో వెనుకగా మరో ద్విచక్రవాహనంలో వచ్చిన వ్యక్తులు, ఎస్ఐ చేతిలోని వాకీటాకీ ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పసికందులకు బంగారు ఉంగరాలు

● అందజేసిన మంత్రి టీఎం అన్బరసన్

అడయార్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ 72వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర మంత్రి టీఎం అన్బరసన్ క్రోంపేట ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిల్లో మార్చి ఒకటో తేదీ జన్మించిన పది మంది పిల్లలకు బంగారు ఉంగరాలను బహూకరించారు. ఈ ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే కరుణానిధి చేయగా, మంత్రి అన్బరసన్ పాల్గొని ఉంగరాలను అందించారు. అలాగే ఈ ఆస్పత్రిలో ప్రసవించి చికిత్స పొందుతున్న మరో 40 మంది తల్లులకు కూడా మంత్రి వివిధ రకాల బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డీఎంకే నేతలు పాల్గొన్నారు.

పగిలిన వీరాణం తాగునీటి పైపులు

అడయార్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా తిరుపోరూరు సమీపంలో చెన్నై మహానగరానికి తాగునీటిని సరఫరా చేసే వీరాణం చెరువు తాగునీటి పైపులు పగిలిపోయాయి. దీంతో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఈ భారీ పైపుకు మరమ్మతులు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ విషయంపై ప్రభుత్వ అధికారులు స్పందిస్తూ, కేలంబాక్కం ప్రధాన రహదారి, పుదుప్పాక్కం సమీపంలో వీరాణం తాగునీటి సరఫరా పైపు పగిలిపోవడంతో లీకేజీ ఏర్పడిందని, దీనిని సిబ్బంది సరిచేస్తున్నారని వెల్లడించారు. ఈ కారణంగా పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు.

లేడీ కానిస్టేబుల్‌తో గొడవ రౌడీకి 179 రోజుల జైలు శిక్ష

అడయార్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చింతాద్రిపేట పోలీస్ స్టేషన్‌లో ఒక మహిళా కానిస్టేబుల్‌తో గొడవపడినందుకు రౌడీకి స్థానిక ఎగ్మోర్ కోర్టు 179 రోజులపాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. ఈ పోలీస్ స్టేషన్‌లో ఇందుమతి అనే మహిళ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. పలు కేసుల్లో నిందితుడైన దర్గా మోహన్ ఆ మహిళా కానిస్టేబుల్‌ను అసభ్యపదజాలంతో దూషించి, గొడవపడ్డాడు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి రౌడీని అరెస్టు చేశారు. ఈ కేసు ఎగ్మోర్ కోర్టులో సాగగా, 179 రోజులపాటు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. దీంతో రౌడీని పుళల్ జైలుకు తరలించారు.

నగరంలో సిగ్నల్స్ వద్ద పందిళ్లు

పెరంబూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వేసవి ఎండల నుంచి ఉపశమనం కల్పించేలా నగరంలోని సిగ్నల్స్ వద్ద పచ్చటి పందిళ్లు ఏర్పాటుచేయాలని చెన్నై కార్పొరేషన్ నిర్ణయించింది. సిగ్నల్స్ సమీపంలో వాహనచోదకులు ఆగాల్సి ఉండడం, ఎండ వేడి కారణంగా వారు అస్వస్థతకు గురయ్యే అవకాశముంది. వాహనచోదకులు, పాదచారుల సౌకర్యార్థం సిగ్నల్స్ ప్రాంతాల్లో పచ్చటి పందిళ్లు ఏర్పాటుచేయాలని కార్పొరేషన్ నిర్ణయించింది. ఆ ప్రకారం తొలివిడతగా అన్నానగర్, అడయార్, వెప్పేరి, రాయపేట సహా 10 ప్రాంతాల్లోని సిగ్నల్స్ వద్ద పందిళ్లు ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

పని కాదు.. బడే ముఖ్యం



తిరుత్తణి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బడికి వెళ్లాల్సిన వయసులో పనికి పోతున్న పిల్లలను వారి తల్లిదండ్రులు బడిలో చేర్పించాలంటూ పల్లిపట్టు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అవగాహనా ర్యాలీని సోమవారం నిర్వహించారు. విద్యాభివృద్ధి సంఘ నిర్వాహకులు ఆర్ముగం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. సుమారు 300మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నీలగిరి జిల్లాలో బాలికపై అత్యాచారం

పెరంబూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో 12 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసిన వ్యవహారంలో తల్లి, ఆమె మూడో భర్త కోసం పోలీసులు గాలిస్తున్నారు. కున్నూర్ ప్రాంతానికి చెందిన 40 ఏళ్ల మహిళకు ఇద్దరు కుమార్తెలున్నారు. కుటుంబ సమస్యల కారణంగా ఇద్దరు భర్తలను వదిలేసిన ఆమె, ప్రస్తుతం మూడో వ్యక్తిని వివాహం చేసుకుంది. ఈ క్రమంలో గత నెల 25వ తేది ఆమె మూడో భర్త ఇంటికివచ్చిన సమయంలో 12 ఏళ్ల కుమార్తె ఒంటరిగా ఉండడం గమనించి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరితోనైనా చెబితే చంపుతానని బెదిరించాడు. కానీ ఆ బాలిక ఈ విషయాన్ని తల్లికి చెప్పగా ఆమె కూడా ఎవరికి చెప్పవద్దని కుమార్తెకు తెలిపింది. దీంతో బాలిక తాను చదివే పాఠశాల ఉపాధ్యాయుల ద్వారా 1098కి ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై పిల్లల భద్రత సంక్షేమ శాఖ అధికారుల ఫిర్యాదుతో కున్నూర్ మహిళా పోలీసులు బాలిక తల్లి, ఆమె మూడో భర్తపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి, పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నారు.

నాలుగేళ్ళు గడిచిపోయింది.. నీట్ రద్దు ఎపుడు?

● ప్రశ్నించిన ఈపీఎస్

అడయార్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నీట్ రద్దు చేస్తామంటూ తప్పుడు హామీ ఇచ్చి నాలుగేళ్ళు గడిచిపోయిందని, నీట్ రద్దు ఎప్పుడంటూ మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి ప్రశ్నించారు. మే నెలలో నీట్ జరుగనున్న నేపథ్యంలో, ఈ పరీక్ష రాసేందుకు భయపడిన విల్లుపురం జిల్లా దిండివనంకు చెందిన ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆయన విచారం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ ఒక ప్రకటన విడుదల చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో నీట్ రద్దు చేస్తామంటూ డీఎంకే తప్పుడు ప్రచారం చేసిందనీ, ఈ హామీ ఇచ్చిన నాలుగేళ్ళు గడిచిపోయిందన్నారు. ఈ హామీ వెనుక ఉన్న రహస్యాన్ని తండ్రీ కొడుకులు బహిర్గతం చేయాలని ఎడప్పాడి డిమాండ్ చేశారు.

తల్లికి చిత్రహింసలు.. తండ్రి హత్య

అడయార్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కన్నతల్లిని చిత్రహింసలు పెడుతున్న తండ్రిని ఓ కుమారుడు హత్య చేశారు. ఈ విషాదకర ఘటన ప్యారీస్ సెవెన్ వెల్స్ ప్రాంతంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు, రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన జగదీష్ సంగ్లా (42), భార్య మోనికాదేవితో పాటు కుమారుడు రోహిత్ తో కలిసి ఉపాధి కోసం నగరానికి వచ్చి ఏడు బావుల ప్రాంతంలో ఉంటున్నారు. రోహిత్ మాత్రం మింట్ రోడ్డులోని ఒక స్వీట్ షాపులో పనిచేస్తున్నాడు. మోహిని దేవీ రాజస్థాన్‌లో సొంతూరులో ఉంటుంది. జగదీష్ సంగ్లా అపుడపుడూ సొంతూరు వెళ్ళి భార్యను చిత్రహింసలు పెట్టేవాడు. ఈ విషయాన్ని ఆమె తన కుమారుడికి చెప్పి విలపించేది. ఈ నేపథ్యంలో ఇటీవల తన తల్లిదగ్గరకు వెళ్ళిన రోహిత్.. కన్నతండ్రి పెట్టే చిత్రహింసలను తెలుసుకుని నగరానికి వచ్చి తండ్రిని నిలదీశాడు. ఈ క్రమంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో ఆగ్రహించిన రోహిత్.. కన్నతండ్రిపై దాడిచేయడంతో అతడు మరణించాడు. దీంతో ఆందోళన చెందిన రోహిత్ తమ కుటుంబ సభ్యుల సహకారంతో రాజస్థాన్ వెళ్ళేందుకు ప్లాన్ చేసుకున్నాడు. ఇంతలో ఈ హత్య కేసు సమాచారం తెలుసుకున్న సెవెన్ వెల్స్ పోలీసులు.. రోహిత్‌ను అరెస్టు చేశారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు గడువు పెంపు

ప్యారీస్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని న్యాయ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి గత నెల 24న ఉపాధ్యాయుల ఎంపిక బోర్డు (టీఆర్బీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టులకు ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణ గత నెలతో ముగిసింది. విద్యార్థుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తులను ఈ నెల 18వ తేది సాయంత్రం 5 గంటల్లోపు సమర్పించాలని టీఆర్బీ ప్రకటన విడుదల చేసింది.

జీసీసీ పరిధిలో రూ.1,781 కోట్ల ఆస్తి పన్ను వసూలు

పెరంబూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) 2024-25 ఆర్థిక సంవత్సరంలో గడిచిన 11 నెలల్లో రూ.1,781.79 కోట్ల ఆస్తి పన్ను వసూలుచేసింది. గత ఏడాదితో పోల్చితే రూ.364.23 కోట్లు అధికం. ఆస్తి పన్ను వసూళ్ళ జీసీసీకి ప్రధాన ఆదాయ వనరు. జీసీసీ పరిధిలోని 13.5 లక్షల మంది ఆస్తి యజమానుల నుంచి పన్ను వసూలవుతోంది. ప్రతి ఏటా ఆస్తి పన్ను రెండు విడతలుగా వసూలుచేస్తుంటారు. గత 2023-24 ఆర్థిక సంవత్సరంలో జీసీసీ రూ.1,755 ఆస్తి పన్ను వసూలుచేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 27వ తేది వరకు (11 నెలలు) రూ.1,781.79 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది.

కదిర్ - ఐశ్వర్య జంటగా 'సుళల్-2'

హీరోయిన్ ఐశ్వర్య రాజేష్, నటుడు కదిర్ నటించిన 'సుళల్-2' వెబ్‌సిరీస్ అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. 'విక్రమ్ వేదా' చిత్ర నిర్మాతలు పుష్కర్ - గాయత్రిలకు చెందిన నిర్మాణ సంస్థ వాల్ వాచ్చర్ ఫిలిమ్స్ పతాకంపై తెరకెక్కింది. బ్రహ్మా, ఎం.అనుశరన్ దర్శకత్వం వహించారు. ఈ వెబ్‌సిరీస్ తొలి భాగం ఘన విజయం సాధించిన నేపథ్యంలో రెండో భాగాన్ని 'సుళల్-2 - ది ఓర్టెక్స్' పేరుతో తెరకెక్కించారు. కదిర్, ఐశ్వర్య రాజేష్, సంతాన భారతి, శ్రేయా రెడ్డి, నివేదా సతీష్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. అమెజాన్ ప్రైమ్‌లో గత నెల 28వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ఈ వెబ్ సిరీస్ గురించి దర్శకులు మాట్లాడుతూ, 'అష్టకాళి అమ్మవారి వేడుకల్లో ఎనిమిది మంది మహిళలకు జరిగిన ఘోరం, ఈ దారుణానికి ఎవరు పాల్పడ్డారు వంటి అంశాలను ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని ఉత్కంఠభరితంగా తెరకెక్కించారం. యువతులపై జరుగుతున్న లైంగిక దాడులను ప్రధానంగా ప్రస్తావించడం జరిగింది. ప్రతి ఎపిసోడ్ ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. ఇన్వెస్టిగేషన్ అభిమానులకు ఇది ఒక విందు భోజనంగా ఉంటుంది' పేర్కొన్నారు.


ఐశ్వర్య రాజేష్

రూ.100 కోట్ల క్లబ్‌లో 'డ్రాగన్'

ప్రదీప్ రంగనాథన్, అనుపమ పరమేశ్వరన్, కయదు లోహర్ జంటగా అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో రూపొందిన 'డ్రాగన్' చిత్రం ఘన విజయం సాధించడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ఫలితంగా చిత్రం విడుదలైన కేవలం పది రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది.. ఈ విషయాన్ని ఆ చిత్ర నిర్మాణ సంస్థ ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ అధికారికంగా వెల్లడించింది. గత నెల 21న విడుదలై ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణ పొందింది. ముఖ్యంగా అమెరికాలో ఏకంగా మిలియన్ డాలర్లకు పైగా కలెక్షన్లు వసులు చేసింది.. 2025లో యూఎస్‌లో మిలియన్ మార్కు దాటిన తొలి మూవీగా 'డ్రాగన్' నిలిచింది. అదేసమయంలో ఫిబ్రవరి 21వ తేదీ తర్వాత తమిళంలో పలు చిత్రాలు విడుదలైనప్పటికీ ప్రేక్షకాదారణ పొందలేకపోవడం డ్రాగన్‌కు బాగా కలిసివచ్చింది. ఒకవైపు కలెక్షన్లు పెరగడంతో ఈ సినిమా ప్రదర్శించే స్క్రీన్ల సంఖ్య కూడా పెంచారు. దీంతో 10 రోజుల్లో వంద కోట్ల రూపాయల గ్రాస్ వసూలుచేసిందని కోలీవుడ్ ఫిల్మ్ ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా, ఈ మూవీలో సీనియర్ దర్శకులు మిష్కిన్, గౌతం వాసుదేవ్ మేనన్ తదితరులు కీలక పాత్రలను పోషించారు. ఈ మూవీకి తెలుగులో కూడా మంచి స్పందన వచ్చింది.


దర్శక నిర్మాతలతో ప్రదీప్ రంగనాథన్

ఆగిపోయిన విశాల్ - సుందర్ చిత్రం

హీరో విశాల్, ప్రముఖ దర్శకుడు సుందర్ కాంబినేషన్‌లో తెరకెక్కాల్సిన భారీ బడ్జెట్ చిత్ర నిర్మాణంపై నిర్మాతలు వెనక్కితగ్గారు. హీరో, దర్శకుడు భారీ పారితోషికం డిమాండ్ చేయడమే ఇందుకు ప్రధాన కారణమని తెలిసింది. సుందర్, విశాల్, సంతానం కాంబినేషన్‌లో 2012లో తెరకెక్కి, 13 యేళ్ళ తర్వాత సంక్రాంతికి విడుదలైన 'మదగదరాజ' మూవీ ఘనవిజయం సాధించింది.అతి తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈచిత్రం ఏకంగా రూ.50కోట్ల మేర వసూలు చేసిం ది. దీంతో సుందర్ సి - విశాల్ కాంబినేషన్‌లో రూ.100 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించాలని ప్లాన్ చేశారు. ఈ మూవీలో కామెడీ పాత్ర కోసం ప్రస్తుతం హీరోగా రాణిస్తున్న సంతానంను సంప్రదించగా, ఆయన నిరాకరించారు. ఆ తర్వాత సీనియర్ హాస్య నటుడు వడివేలును సంప్రదించగా, హీరో విశాల్ రూ.30 కోట్లు, దర్శకుడు సుందర్ రూ.20 కోట్లు చొప్పున పారితోషికాన్ని డిమాండ్ చేసినట్టు సమాచారం. దీంతో ఈ చిత్రాన్ని ప్లాన్ చేసిన బెంజ్ మీడియా అధినేత ఏసీ అరుణ్ కుమార్ వెనక్కితగ్గినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం.


విశాల్, సుందర్ సి

తమిళ చిత్రజ్యోతి

దివ్య భారతితో డేటింగా? జీవీ క్లారిటీ

ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ హీరోయిన్ దివ్యభారతితో డేటింగ్‌లో ఉన్నట్టు జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ కారణంగా తన భార్య సైంధవికి జీవీ విడాకులు ఇచ్చారంటూ కథనాలు వచ్చాయి. అయితే, ఈ ప్రచారాన్ని ఇంత కాలం వారిద్దరూ ఎక్కడా ఖండించలేదు. కానీ, ఇపుడు వీరిద్దరూ కలిసి 'కింగ్‌స్టన్' అనే చిత్రంలో నటించారు. ఈ నెల 7వ తేదీన ఈ మూవీ విడుదలకానుంది. ఈ సినిమా ప్రయోషన్ కార్యక్రమాల్లో వారిద్దరూ కలిసి పాల్గొనాల్సి వస్తుంది. దీంతో మీడియా అడగకముందే తమ మధ్య ఉన్న రిలేషన్‌షిప్‌పై హీరోహీరోయిన్లు స్పందిస్తున్నారు. ఈ విషయంపై జీవీ మాట్లాడుతూ, 'నేను నటించిన 'బ్యాచిలర్' సినిమాలో దివ్యభారతి హీరోయిన్. అప్పటి నుంచి మేమిద్దరం స్నేహితులుగా ఉన్నాం. ఇపుడు కింగ్‌స్టన్ మూవీలో మరోమారు కలిసి నటించాం. కానీ, దివ్యభారతితో నేను డేటింగ్‌లో ఉన్నట్టుగా ప్రచారం సాగుతోంది. ఆమెను లొకేషన్‌లో మాత్రమే కలుసుకున్నాను. బయట ఎక్కడా కలుసుకున్న సందర్భాలు లేవు. ఆమె నాకు ఒక మంచి స్నేహితురాలు మాత్రమే' అని స్పష్టం చేశారు.


దివ్యభారతి - జీవీ ప్రకాష్

మదురైలో మళ్లీ ఆకట్టుకోనున్న చేపల విగ్రహం

పెరంబూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మదురై రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల్లో భాగంగా తొలగించిన చేపల విగ్రహం మరో ప్రాంతంలో ఏర్పాటుకు కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు.. మదురై రైల్వేస్టేషన్ ప్రవేశద్వారం వద్ద పాండ్య రాజుల స్మారకంగా చేపల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మదురైకి ఆనవాలుగా 20 ఏళ్ల క్రితం ఈ విగ్రహం ఏర్పాటుకు అప్పట్లోనే రూ.8 లక్షలు ఖర్చయింది. కుంభకోణానికి చెందిన స్థపతులు దీనిని రూపొందించారు. 15 అడుగుల పొడవు, 3 టన్నుల బరువుతో మూడు చేపలు ఒక దానిపై ఒకటి ఉండేలా కనిపిస్తూ, ఫౌంటైన్ నుంచి నీరు పడుతూ చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ క్రమంలో, మదురై రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల్లో భాగంగా తొలగించిన ఈ విగ్రహాన్ని మళ్లీ అదే ప్రాంతంలో ఏర్పాటుచేయాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు. దీనికోసం ధీరన్‌తిరుమురుగన్ అనే వ్యక్తి, హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో పిటిషన్ వేశాడు. మెట్రో ప్రాజెక్ట్ చేపట్టనున్న నేపథ్యంలో, ఈ ప్రాంతంలో విగ్రహం ఏర్పాటుకు వీలుకాదంటూ రైల్వే శాఖ తరపున హైకోర్టుకు తెలియజేశారు. హైకోర్టు ఆదేశాలతో ఓ కమిటీ ఏర్పాటుచేసి విగ్రహం ఏర్పాటుకు అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేసేందుకు మదురై కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. ఈ కమిటీ పలు ప్రాంతాలు పరిశీలించి సెల్లూరు రౌండ్ తానా ప్రాంతాన్ని ఎంపిక చేసింది. ప్రస్తుతం విగ్రహానికి మరమ్మతులు చేపడుతున్నామని, త్వరలో విగ్రహం ఏర్పాటుచేయనున్నట్లు కార్పొరేషన్ అధికారులు తెలిపారు.



విద్యార్థినికి స్టాలిన్ ఆపన్నహస్తం

● ఉన్నత విద్య, ఉద్యోగం, వివాహానికి సందేశం ● సీఎం సాయానికి మదురై యువతి ఆనందం

టి.నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాలేజీలో ఉన్నత చదువులకు, ప్రభుత్వ ఉద్యోగం వచ్చేంత వరకు అన్ని విధాలా సాయపడిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చివరకు ఆదివారం జరిగిన తన వివాహానికి శుభాకాంక్షలు తెలుపటంతో మదురై యువతి ఆనందభాష్పాలతో ఆయనకు ధన్యవాదాలు తెలుపుకుంది. ఆ శుభాకాంక్షల సందేశాన్ని ఓ మంత్రి ద్వారా తనకు పంపించడంతో ఆ యువతి సంతోషానికి పట్టపగ్గాల్లేకపోయింది. ఈ ఆసక్తికర ఘటనకు సంబంధించి వివరాలిలా.. మదురై జిల్లా చోళవందాన్ సమీపం తిరువేడగం ప్రాంతానికి చెందిన మనోహరన్, మురుగేశ్వరి దంపతుల పెద్ద కుమార్తె శోభన కాలేజీలో చదువుతుండగా డ్రైవర్‌గా ఉన్న తండ్రికి గుండెపోటుకు గురై అస్వస్థత చెందారు. ఆ సమయంలో పాఠశాల చదువు ముగించి కాలేజీలో చేరి ఉన్నత చదువులు చదవాలన్న కోరిక నెరవేరదేమోనని దిగులు చెందింది. అదే సమయంలో తన చదువుకు సాయం చేయాలని ముఖ్యమంత్రికి లేఖ రాసింది. ఆలేఖ అందుకున్న ముఖ్యమంత్రి స్టాలిన్ వెంటనే ఆ యువతికి ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ ఇప్పించారు. కళాశాల విద్య మంచి మార్కులతో పాసైంది. ఈ విషయం ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిసి ఆమెకు తగిన అర్హతలుంటే ప్రభుత్వ ఉద్యోగంలో చేర్చుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. మదురై కార్మిక సంక్షేమ శాఖలోనే ఆమెకు ఉద్యోగం లభించింది. ఇటీవల కార్తీక్ అనే యువకుడితో ఆమెకు నిశ్చితార్థం జరిగింది. ఇటీవల ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకుని శోభన తన వివాహానికి హాజరుకావాలని వేడుకుంది. ఈ నేపథ్యంలో ఆదివారం శోభన వివాహవేడుకలకు తన తరఫున హాజరుకావాలని మంత్రి మూర్తిని పంపించిన స్టాలిన్, శుభాకాంక్షల సందేశాన్ని ఆమెకు ఇవ్వాలని సూచించారు. ఆదివారం మదురై తల్లాకులం మురుగన్ ఆలయంలో జరిగిన శోభన వివాహ వేడుకలకు మంత్రి మూర్తి హాజరై సీఎం పంపిన సందేశాన్ని అందజేయడంతో ఆమెతో పాటు ఆ పెళ్ళికి హాజరైనవారంతా ఆశ్చర్యపోయారు. ఆ సందర్భంగా శోభన మీడియాతో మాట్లాడుతూ తన పైచదువులకు, ప్రభుత్వ ఉద్యోగం లభించేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ తన తండ్రిలా సాయపడ్డారని, ముందుగా ఏర్పాటైన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉండటంతో వివాహానికి రాలేనని ఆయన చెప్పారని తెలిపారు. ఈ పరిస్థితులలో మంత్రి ద్వారా తనకు వివాహ శుభాకాంక్షలు తెలిపిన 'నాన్న స్టాలిన్'కు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని శోభనా చెప్పారు.


వధూవరులకు ముఖ్యమంత్రి స్టాలిన్ సందేశాన్ని అందజేస్తున్న మంత్రి మూర్తి

తిరుత్తణిలో ప్రారంభమైన మాసి మఖ బ్రహ్మోత్సవాలు

తిరుత్తణి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో ప్రసిద్ధి చెందిన మురుగన్ ఆలయంలో సోమవారం మాసి మఖ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము 3గంటలకు నిర్వహించిన శ్రీవల్లి, మురుగన్ స్వామివార్ల తిరుకల్యాణానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం దేవేరులతో స్వామివారు పురవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా స్వామివారు బంగారు కవచంతో భక్తులకు దర్శనిచ్చారు. కాగా, ఆలయంలోని ఉదయం శుభముహూర్తాన ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించి, మాసి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు.


ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

నేటినుంచి వడివుడై అమ్మన్ ఆలయంలో వేడుకలు

● 10న రథోత్సవం

అడయార్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్రియూరులోని వడివుడై అమ్మన్ ఆలయంలో మాసిమఖ ఉత్సవాలు మంగళవారం ధ్వజారోహణంతో ప్రారంభంకానున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి 7 గంటలకు గణపతి పూజ జరిగింది. మంగళవారం రాత్రి ధ్వజారోహణంతో ఈ వేడుకలను ప్రారంభిస్తారు. 5వ తేదీ ఉదయం సూర్య ప్రభ వాహనంలో చంద్రశేఖర ఉత్సవం, సాయంత్రం చంద్రప్రభ వాహనంలో త్యాగరాజ స్వామిని మాడవీధిలో ఊరేగిస్తారు. ఈ వేడుకల్లో కీలక ఘట్టమైన రథోత్సవం ఈ నెల 10వ తేదీ జరగనుంది. ఈ వేడుకల సందర్భంగా పోలీసులు గట్టి భద్రతను కల్పించారు.

మాంబళం రైల్వేస్టేషన్‌కు నూతన సొబగులు



మాంబళం రైల్వేస్టేషన్ ప్రవేశద్వారం నమూనా - టిక్కెట్ కౌంటర్లు

పెరంబూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన సబర్బన్ రైల్వేస్టేషన్‌లో ఒకటైన మాంబళం రైల్వేస్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. వ్యాపార కేంద్రమైన టి.నగర్‌కు వచ్చే ప్రజలు మాంబళం రైల్వేస్టేషన్‌కు వస్తుంటారు. ప్రతిరోజు సుమారు 200 సబర్బన్ రైళ్లు, 90కి పైగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ స్టేషన్ మీదుగా వెళ్లుండగా, స్టేషన్‌లో ఐదు ప్లాట్‌ఫారాలున్నాయి. ఈ రైల్వేస్టేషన్‌ను రూ.14.7 కోట్లతో పునరుద్ధరిస్తున్నారు. ఆ ప్రకారం, స్టేషన్ ఈస్ట్, వెస్ట్ ప్రవేశద్వారాల్లో ఆర్చ్‌లు ఏర్పాటుకానున్నాయి. అలాగే, పార్కింగ్ వసతి, కొత్తగా టిక్కెట్టు కౌంటర్లు, సీసీ కెమెరాలు, డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు, ఫ్లాట్ ఫారాల విస్తరణ, లౌడ్ స్పీకర్లు తదితరాలు ఏర్పాటుకానున్నాయ. ప్రస్తుతం పునరుద్ధరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, తొలివిడత పనులు ఈ నెలాఖరుకు పూర్తిచేయాలని నిర్ణయించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

సీఎస్‌కేతో సీయూబీ ఒప్పందం

అడయార్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీల్లో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టుతో దేశంలోని ప్రైవేట్ సెక్టార్ బ్యాంకుల్లో ఒకటైన సిటీ యూనియన్ బ్యాంకు కీలక ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా 'కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డు'ను ప్రవేశపెట్టనున్నాయి. ఈ క్రెడిట్ కార్డులను 'ఎక్స్‌క్లూజివ్ సీఎస్‌కే థీమ్‌తో డిజైన్ చేశారు. ఎక్స్‌క్లూజివ్ రివార్డు ప్రోగ్రామ్, స్పెషల్ సీఎస్‌కే మర్చండైజ్ ఆఫర్లు, సెక్యూరిటీ, కన్వీనియన్స్ వంటి ప్రత్యేక ఫీచర్లతో ఈ కార్డులను డిజైన్ చేసి అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా జరిగిన ఒప్పంద కార్యక్రమం సిటీ యూనియన్ బ్యాంకు ఎండీ, సీఈవో డాక్టర్ ఎస్.కామకోడి సమక్షంలో జరుగగా, ఒప్పంద పత్రాలపై సీయూబి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్ ఆనంద్‌తో పాటు సీఎస్‌కే ప్రతినిధులు సంతకాలు చేశారు. సీయూబీ ఎండీ కామకోడి మాట్లాడుతూ, చెన్నై సూపర్ కింగ్స్ శక్తిని, సిటీ యూనియన్ బ్యాంకు ఆర్థిక సేవలతో కలిపే అత్యాధునిక క్రెడిట్ కార్డు మా అభిమానులకు తీసుకుని రావడానికి ఎంతో సంతోషిస్తున్నాం. ఈ కార్డు కేవలం ఆర్థిక ప్రయోజనాల కంటే ఎక్కువ ప్రయోజనం చేకూర్చుతుంది. ప్రత్యేకమైన బహుమతులు, మరుపురాని అనుభూతులను పొందే కార్డుగా సీఎస్‌కే ఫ్యామిలీలో భాగం కావడానికి ఒక ఎంట్రీగా ఉంటుంది' అని పేర్కొన్నారు. సీఎస్‌కే సీఈవో కేఎస్ విశ్వనాథన్ మాట్లాడుతూ, 'సిటీ యూనియన్ బ్యాంకుతో ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషంగా ఉంది. కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డు ప్రారంభించడంతో ప్రత్యేక ప్రయోజనాలను ఆస్వాదిస్తూనే తబ అభిమానులు జట్టు పట్ల మక్కువ చాటడానికి ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు.



క్రెడిట్ కార్డు నమూనా ఆవిష్కరణ దృశ్యం

ఎన్‌ఎల్‌సీ చేతికి పవన విద్యుత్ ప్రాజెక్టు

అడయార్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని నవరత్న కంపెనీల్లో ఒకటైన ఎన్‌ఎల్‌సీ ఇండియా (ఎన్‌ఎల్‌సీఐఎల్) ఎస్‌జేవీఎస్ నుంచి విండ్ పవర్ (పవన విద్యుత్) ప్రాజెక్టును దక్కించుకుంది. కే.వి.విద్యుత్ రూ.3.74 పైసల టారిఫ్‌తో 200 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టును గత నెల 28న కుదిరిన ఒప్పందం ద్వారా సొంతం చేసుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతియేటా 526 మెగా యూనిట్ల క్లీన్ గ్రీన్ పవర్ ఉత్పత్తి చేస్తారు. 2030 నాటికి 10 గిగావాట్స్ రెన్యువబుల్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులోభాగంగానే తాజాగా జేఎస్‌వీఎన్ నుంచి ఈ ప్రాజెక్టును సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా ఎన్‌ఎల్‌సీ చైర్మన్, ఎండీ ప్రసన్నకుమార్ మోతుపల్లి మాట్లాడుతూ, ఇవి ఎంతో గర్వించదగిన క్షణాలన్నారు. పునరుత్పాదక విద్యుత్ రంగంలో తమ వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి ఈ ఒప్పందం ఎంతగానో దోహదపడుతుందన్నారు 200 మెగావాట్స్ పవవ విద్యుత్ ప్రాజెక్టు సొంతం చేసుకోవడం స్థిరమైన, స్వచ్ఛమైన ఇంధన పరిష్కారాల్లో తమ నిబద్ధతను తెలియజేస్తుందన్నారు. దేశ ఇంధన పరివర్తన లక్ష్యాలలో గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనలో తమ వంతు కృషి చేస్తామన్నారు.


శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, కెనడాకు చెందిన ట్రాన్స్‌ఫార్మింగ్ క్లెఫ్ట్ (టీసీ) భాగస్వామ్యానికి ఇరవయ్యేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం చెన్నైలో వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విద్యా మనస్తత్వవేత్త డాక్టర్ శరణ్యను సత్కరిస్తున్న టీసీ ఈడీ హ్యూబ్రూస్టర్, వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ ఉమా శేఖర్

ఆర్జీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మారథాన్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

చెన్నై, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్జీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో బీసెంట్‌నగర్‌లోని ఓల్కాట్ మెమోరియల్ హయ్యర్ సెకండరీ స్కూలులో మారథాన్ జరిగింది. 'రన్ ఫర్ ద అన్‌స్టాపబుల్స్' పేరుతో నిర్వహించిన ఈ మారథాన్‌లో 1500 మంది దివ్యాంగులు పాల్గొన్నారు. 11 విభాగాల్లో నిర్వహించిన ఈ మారథాన్‌లో పురుషులు, మహిళా అథ్లెట్లు కూడా పాల్గొనడం విశేషం. ఆర్థిక నేరాల నియంత్రణా ఇన్స్‌పెక్టర్ జనరల్ ఎం.సత్యప్రియ, సీనియర్ న్యాయవాది ఆర్.ప్రభాకరన్, ఆర్జీ హాస్పిటల్ యూరాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.


నాగపట్టిణం చేపల హార్బర్‌ను సోమవారం పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్